కథ

# నవ్విన నాపచేను పండుతుంది...



## బిరుదురాజు ప్రమీల రాణి

క్రెటో కారు రివ్వున పోతోంది. అక్కడక్కడ రోడ్డు బాగోకపోయినా వీచే చల్లటిగాలులు కుదుపులకు ఉయ్యాల ఊగినట్టుంది హాయిగా ఉంది. తూరుపు తెలవారుతోంది. వెలుగు కిరణాలు భువిని పరచుకుంటున్నాయి. దారి పొడుగునా పచ్చని పంట చేలు, ఎత్తుగా గుబురుగా పెరిగిన సరుగుడు చెట్ల నీడలు, అల్లిబిల్లి గా కదులుతున్న చెట్ల నీడలు, పక్షుల కిలకిలారావాలు... వింత లోకంలో విహరిస్తున్నట్టుంది.

సిటీకి దూరంగా వున్న పల్లెటూళ్ళు ఒక్కోటి వస్తున్నాయి.

"అమ్మా! కాసేపు ఇక్కడ ఆపనా?" అన్నాడు రఘురామ్.

"వద్దులే నాన్నా పోనియ్, టైమ్ ఎంత?" పక్కనున్న భర్తను అడిగింది..

పేపర్లో తలదూర్చి సీరియస్ గా చదువుతున్న విశ్వం తల కూడా ఎత్తలేదు.

తండ్రి సంగతి తెలిసిన రఘురామ్ చిన్నగా నవ్వుతూ.. "ఎనిమిదిన్నర అమ్మా.."చెప్పాడు.

"అంతేనా? 10 గంటలకల్లా అక్కడికి వస్తామని వాళ్ళతో చెప్పాము ఇంకా ఎంతదూరం ఉందో?" స్వగతంగా అనుకుంది.

హైదరాబాద్ లో బయలుదేరినప్పుడు ఐదు అయ్యింది. రోడ్డుకు అడ్డంగా జనాలు, హారన్ నొక్కాడు. ఏదో పెద్ద గుడి... గుమిగూడిన జనం.

"అబ్బ!తప్పుకోరేంటి?" విసుగ్గా అన్నాడు రఘు.

ఎల్లుండి శ్రీరామనవమి అందుకే ఈ హడావిడి చేస్తున్నారు. తాటాకు పందిళ్ళు, విద్యుద్దీపాలు అలంకరిస్తున్నారు.

మళ్ళీ హారన్ నొక్కాడు. మెల్లగా తప్పుకున్నారు జనం.

"ఏవండీ ఇది ఏవూరు?" అన్నాడు రఘు.

"రామాపురం సార్!"

"వెంకటాపురం ఇంకెంత దూరం ఉందో చెప్పండి."

"గట్టిగా ఎల్తే అరగంటలో ఎల్తారు"

"సరే" కారు స్పీడ్ పెంచాడు రఘు.

రఘు పెద్దమ్మగారింటిలో బారసాల వేడుకకు వెళుతున్నారు. సివిల్ ఇంజనీర్ చేసి ఈ మధ్యే రిటైర్ అయ్యారు విశ్వం. అమ్మ మీనాక్షి గృహిణి. రఘురామ్ పెద్ద ఐ టి కంపెనీ ఓన్ గా నడుపుతున్నాడు..

***

విమలమ్మ రోడ్డు మీద సందడికి రోడ్డు వైపు చూసింది. పక్క సందులో ఉన్న తెలిసినవాళ్ళు నలుగురైదుగురు ముస్తాబై కలిసి వెళుతున్నారు, పేరంటం పిలుపులు కాబోలు..

తన ఇంటికి కూడా వస్తారేమో అని చూసింది విమలమ్మ, వాళ్ళు ఇల్లు దాటి వెళ్ళిపోయారు.

విమలమ్మ మనసు చివుక్కుమంది. ఈరోజు వెంకన్నగారి అమ్మాయికి పసుపు కోట్టున్నారని తెలిసింది. మరి నన్ను పిలవకుండానే వెళ్ళిపోయారు. అర్థం కాక స్తంభాన్ని పట్టుకుని చూస్తూ వుంది.

చాకలి ఐలమ్మ మూట తెచ్చి వరండాలో కూర్చుని "విమలమ్మగారూ, రండి బట్టలు లెక్క చూసుకోండి.." గట్టిగా పిలిచింది.

"ఏవిటే ఆ కేకలు ఇక్కడే ఉన్నాగా" కినుకుగా అంది విమలమ్మ.

"ఏటో... ఆలోసిత్తన్నారుగా ... అందుకే గట్టిగా అరిశానమ్మా"

"చాల్లే ఊరుకో ఊరంతా వినపడుతుంది.. పద్దు పుస్తకం తెస్తా వుండు ఐలూ.." లేవబోయింది.

అంతలో వైదేహి పద్దు పుస్తకంతో వచ్చింది.

ఐలమ్మ కళ్ళకి లచ్చిందేవి నడిసి వట్టున్నట్టుగా ఆరాధనగా చూసింది. లెక్కచూసాక బట్టలు తీసుకుని లోపలికి వెళ్ళింది వైదేహి..

విమలమ్మ అడిగింది "వెంకన్న గారింటి పెళ్ళి పిలుపులు మాకు రాలేదేంటో" అంది మెల్లగా.

"పోనిండమ్మ, పిలిచి ఆళ్ళు అనేవి వినేకంటే పిలిచినా ఎల్లకుంటే మంచిది."

వైదేహి బట్టలు తీసుకుని లోపలికి వెళ్ళి పోగానే గుసగుసగా అంది ఐయిలమ్మ.

"మన వైదేహమ్మ కి పెళ్ళి కుదరడం లేదని, వైదేహమ్మ జాతకం మంచిది కాదని పాతికేళ్ళు వచ్చాయి అని సెప్పకుంటన్నారు.".

"విమలమ్మను పిలిస్తే అన్నిట్లో చెయ్యి వెయ్యమనాలి, ఎందుకుఅనుకుంటున్నారమ్మా" కాస్త బాధగా అంది ఐయిలు.

"విమలమ్మ గారూ!.. నేనోటి సెప్పనా.. వైదేహమ్మకి. ఆలీసం అయినా బంగారంలాంటి మొగుడు వత్తాడు.. అది చూసి అందరూ కుళ్ళుకుని సత్తారు నవ్విన నాపచేనే పండుద్దమ్మా.." దీర్ఘం తీసుకుంటూ మెటికలు విరిచింది ఐలమ్మ.

"పోనీలే...ఐయిలూ నీ నోటి వాక్యాన.. అలా జరిగితే పట్టుచీర పెడతాను" అని, నిట్టూరుస్తూ లోపలికి వెళ్ళి సోఫాలో కూర్చుంది విమలమ్మ.

వైదేహిని పక్క వూరులో బి ఎస్ సి వరకూ చదివించారు. మంచి మెరిట్ స్టూడెంట్ కానీ హైదరాబాద్ పంపి చదివించడానికి తండ్రి రంగారావు ఒప్పకోలేదు.. డిగ్రీ అయ్యి రెండు సంవత్సరాల అయ్యింది.

"కంప్యూటర్ నేర్చుకుంటా నాన్నా" అంది.

"ఏం వద్దు, , పెళ్ళి అయ్యాక నీ భర్త ఇష్టం అప్పటి వరకు ఇంటి పని,వంట చేయడం నేర్చుకో.."

రంగారావుకు ఎదురు చెప్పే ధైర్యం లేక ఊరుకున్నారు. కొడుకు విజయ్ ని మాత్రం ఎంటెక్ హైదరాబాదులో చదివిస్తున్నారు..

ఆ ఊరిలో పలుకుబడి ఉన్న మంచి రైతు రంగారావు. నలుగురిలో మంచి పేరు తెచ్చుకున్నాడు. అప్పలు, తప్పలు ఎరుగడు.. ఎవరికైనా సహాయం చేయడం ఎదుటి వారి కష్టం తన కష్టంగా భావించి చేయూతనిచ్చె మంచి వ్యక్తి రంగారావు.

వైదేహికి పెళ్ళి చేయాలని సంబంధాలు చూడడం మొదలుపెట్టాడు.. ఎన్ని సంబంధాలు చూసిన వైదేహి చదువు నచ్చలేదు, ఈ చదువుకు ఉద్యోగం రాదు, ఈ రోజుల్లో ఆడ మగ ఉద్యోగాలు చేసుకుంటే బాగుంటుంది. తిని కూర్చుంటే ఎలాగా అని కొందరు, విమర్శించుకుంటూ వచ్చారు.

రంగారావు ఇచ్చే కట్నకానుకలు నచ్చలేదు కొందరికి పిల్ల, చదువు నచ్చలేదు. అందం కొరుక్కుతింటామా ఏమిటి అనుకుంట కొందరు, జాతకాలు కలవలేదని వంకలు పెట్టడం కొందరు. తిరిగి వెళ్ళిపోతున్నారు.

వైదేహి చక్కని చుక్క. మంచి ఎత్తు, పచ్చని శరీరచాయ మోములో లక్ష్మీ కళ ఉట్టిపడుతుంది. ఒత్తైన తలకట్టు, బారెడు జడ చక్కని అందగత్తె వైదేహి..

***

ఆరోజు శ్రీరామ నవమి రామాలయంలో ఒకటే సందడి. వైదేహికి ఈ ఏడాది అయినా పెళ్ళి కుదరాలని మొక్కుకుని రంగారావు విమలమ్మ శ్రీరామ కళ్యాణమంటపంలో పీటలపై కూర్చున్నారు. అరటి గెలలు, పూల దండలతో, ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలన్నీ సమకూర్చుకుని గుడికి వెళ్ళారు.



అంగరంగ వైభోగంగా సీతారామ కళ్యాణం జరుగుతోంది. మైక్ సెట్ లో ఊరంతా స్పష్టంగా మంత్రాలతో సహా వినిపిస్తోంది.. కళ్యాణం అయిన తర్వాత అన్నసంతర్పణ ఉన్నదని మైక్ లో చెప్పారు..

అభిజిత్ లగ్నం 12 గంటల అవగానే సీతారాముల తలంబ్రాలు కార్యక్రమంతో కళ్యాణం వేడుకగా జరుగుతోంది. వచ్చిన వాళ్లందరికీ పానకం, వడపప్పు, చలిమిడి ప్రసాదంగా పెట్టి భోజనానికి వెళ్ళమని దారి చూపిస్తున్నారు. మంగళ హారతి పాట పాడమని అందరూ వైదేహిని అడుగుతున్నారు.

వైదేహి రాముని పై చక్కని పాట పాడింది. మైక్ లో వైదేహి పాట గాలి తరంగాల పై తేలుతూ మృదుమధురంగా బయటకు మైలు దూరం వినిపిస్తోంది.

***

సన్నని వానతుంపర పడుతోంది. తిరిగి వస్తున్న రఘురామ్ తో “నాన్నా రఘు.! కారు పక్కగా ఆపు” అంది తల్లి.

“కల్యాణం అయిపోయినట్టుగా వుంది. దర్శనం చేసుకుని స్వామితలంబ్రాలు కొన్ని తీసుకుందాం” అన్నారు.

“అమ్మా! నాన్నగారికి నీరసం వస్తుందేమో లంచ్ టైమ్ అవుతోంది కదా” అన్నాడు, రఘు కారు స్లో చేస్తూ.

“ఫరవాలేదులేనాన్నా దర్శనం చేసుకుని వెళ్ళిపోదాం” డోరు తీసుకుని దిగుతూ అంది మీనాక్షి.

కారు పక్కనపెట్టి తల్లితండ్రులతో గుడిలోకెళ్ళాడు రఘురామ్. వైదేహి స్వరం గుడిలో మృదుమధురంగా వినిపిస్తోంది. రఘురామ్ వాళ్ళు ఎవరు పాడుతున్నారా అని చూసారు. అంత జనంలో గుర్తించలేకపోయారు.

అన్నప్రసాదం తిని వెళ్ళమని మనిషి మనిషికీ చెపుతున్నాడు రంగారావు. పట్టుపంచలో కండువా కప్పుకున్న రంగారావును చూసి దగ్గరకెళ్ళాడు రఘురామ్ తండ్రి విశ్వం.

చూస్తూచూస్తూ దగ్గరకొచ్చి “సార్! మీరు యలమంచలి రంగారావు గారేనా?” అనుమానంగా అడుగుతున్న వ్యక్తి వైపు చూస్తూ...

రంగారావు ఆశ్చర్యంగా “మీరూ.... ఒరే విశ్వం! నువ్వు నా విశ్వానివేనా..?” సంబరంగా గట్టిగా హత్తుకున్నాడు రంగారావు.

విశ్వం కూడా నవ్వుతూ "ఒరే రంగా, ఎలా వున్నావు?"

"బాగున్నాను.. నువ్వూ.." కుశలప్రశ్నలు వేసుకున్నారు.

"రా రా భోజనం చేసి ఇంటికి వెళదాం పద" అంటూ అన్నప్రసాదం వైపు అందర్నీ తీసుకెళ్ళాడు రంగారావు.

***

ముందుగానే భార్య విమలమ్మను, కూతురు వైదేహిని ఇంటికీ పంపాడు.. రఘురామ్ తల్లిదండ్రులతో వచ్చారు. సాదరంగా ఆహ్వానించి, ఎదురొచ్చింది విమలమ్మ.

సోఫాలో కూర్చుని ఇల్లంతా ఓసారి కలియచూసి "ఒరే రంగా వ్యవసాయం చేస్తున్నావన్నమాట.. అగ్రికల్చరల్ డిగ్రీ చదువింది నీ పొలం నువ్వే చూసుకోడానికేనన్నమాట" నవ్వుతూ అన్నాడు విశ్వం.

"అవునురా.. నా ఐదు ఎకరాలు నేనే పండిస్తున్నా ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అబ్బాయి హైదరాబాద్ లో చదువుతున్నాడు."

అంతలో చల్లటి మజ్జిగతో వచ్చిన వైదేహిని చూపిస్తూ "ఈ అమ్మాయి నా కూతురు వైదేహి బీఎస్సీ చేసింది.. పెళ్ళి చెయ్యాలని పై చదువుకు పంపలేదు" చెప్పాడు.

"మరి నీకు?"అన్నాడు రంగారావు.

"ఇదుగో రా వీడు నా ఒక్కగాని ఒక్కకొడుకు రఘురామ్ హైదరాబాద్ లో పెద్ద కంపెనీలో ఎండి గా చేస్తున్నాడు. వీడికి పెళ్ళిచేసే ప్రయత్నంలోనే ఉన్నాం.."

"సరే రా, రంగా! మరిక బయలు దేరతాం హైదరాబాద్ వెళ్ళేసరికి చీకటి పడుతుంది, మళ్ళీ త్వరలో కలుద్దాం" అంటూ లేవబోతుంటే విమలమ్మ పకోడి ప్లేట్ తో వచ్చి, "ఈ రాత్రి వుంటే బాగుంటుంది" అంది.

మీనాక్షి నవ్వుతూ "మరోసారి వస్తాంలే వదినా" అంది.

వెళుతూవెళుతూ రఘు వైదేహిని చూసాడు. ఎంత అందంగా ఉందో అంత పెద్ద అందమైన కళ్ళు నేనెక్కడా చూడలేదు. బంగారు బొమ్మలా వుంది ఓ క్షణం కన్నార్పకుండా చూస్తూ కదిలాడు.

రఘు కూడా ఆరడుగుల అందగాడు సంపన్న కుటుంబానికి ఒకే ఒక్క వారసుడు.

కొడుకును గమనిస్తున్న మీనాక్షి, విశ్వం చిన్నగా నవ్వుకున్నారు.

***

మూడోరోజు మళ్ళీ వచ్చిన విశ్వం కుటుంబాన్ని చూసి అనుకోని అతిధుల్లా వచ్చినందుకు ఆనందంగా వుంది.

"విశేషం ఏమిట్రా?" పక్కనే కూర్చుని అన్నాడు రంగారావు.

రఘురామ్ కళ్ళు వైదేహి కోసం వెదుకుతున్నాయి. విమలమ్మ, మీనాక్షి మాటలు కలుపు కుంటున్నారు.

"విషయానికి వద్దాం రంగా మా అబ్బాయి రఘురామ్ కి మీ అమ్మాయి వైదేహిని ఇవ్వమని కోరుకుంటున్నాను.."

ఆనందంతో కళ్ళు మెరిసాయి రంగరావుకి, విమలమ్మకి.

"శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు! పదిరోజుల్లో మంచి ముహూర్తం ఉంది, పెళ్ళిముహూర్తం పెట్టించేద్దాం. అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణంలా మన పిల్లల పెళ్ళి చేద్దాం. ఏమంటావు రంగా..?" ఆనందంగా అన్నాడు విశ్వం.

"అలాగే చేద్దాం.. కోరి కోరి నా కూతుర్ని కోడలిగా చేసుకుంటున్నావు, చాలా సంతోషంగా ఉంది.." భోజనాలు ఏర్పాటు చెయ్యమన్నాడు రంగారావు.

"మా కోడలితో పాయసం చేయించమ్మ.." నవ్వుతూ అన్నాడు విశ్వం.

రఘురామ్ మెల్లగా లేచి వరండా వైపు కదిలాడు, వరండాలో తీగపైనున్న బట్టలు తీస్తున్న వైదేహి దగ్గరకు వెళ్ళాడు. వెనక అలికిడికి తల తిప్పిన వైదేహి ఉలిక్కి పడింది.

"మీకు ఇష్టమేనా ఈ వివాహం?" అన్నాడు.

కళ్ళు పెద్దగా చేసి తలఊపి, సిగ్గుతో లోపలికి తుర్రుమంది. ఆమె వెళ్ళినా వాలు జడ కనిపిస్తూనే వుంది.

నవ్విన నాప చేను పండుతుంది అంటే ఇదే సుమా.. ఇదంతా రాముని దీవెన.. సంతృప్తిగా అనుకున్నారు...

వారం రోజుల్లో అంగరంగ వైభవంగా రఘురామ్, వైదేహి లకు వివాహం జరిగింది. గొప్పింటి, అందమైన రాకుమారుడు వైదేహి మొగుడని ఊరంతా అబ్బురంగా చెప్పకున్నారు. అదృష్టాన్ని ఎవరూ చెరపలేరు... దురదృష్టాన్ని ఎవరూ ఆపలేరు.

శుభం

# డాక్టర్ రావూరి భరద్వాజ అవార్డు గ్రహీతలు



డా రమాదేవి బుక్కపట్నం గారు



డా మంత్రిప్రగడ మార్కండేయులు గారు